





ముగ్గు వేస్తున్న మహిళలు



ముగ్గును పరిశీలిస్తున్న అతిథులు

అవనిపై హరివిల్లు

- అలరించిన ముగ్గుల పోటీలు
- ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు
- నంద్యాల టెక్కె మార్కెట్ ముగ్గుల మయం
- రాయలసీమ సంస్కృతి భిన్నమైనవి
- బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

అవని.. అందాల ముత్యాల ముగ్గులతో మురిసింది. రంగురంగుల ముగ్గులు వేసేందుకు మహిళలు వయసు తారతమ్యాలను మరచి పోటీపడగా.. చూపరుల మది పులకించింది. తెలుగు లోగిళ్లలో సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా చేసుకునే అచ్చతెలుగు పండుగ సంక్రాంతి. ఈ పండుగను పురస్కరించి ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో నంద్యాల పట్టణంలో ముత్యాల ముగ్గుల పోటీల సంబరాలు అంబరాన్నంటాయి. చిన్నారులు చిట్టి చేతులతో రంగవల్లులు వేస్తుంటే... మహిళలు కొంగు బిగించి అందాల హరివిల్లులను తీర్చిదిద్దారు. నానాటికీ కనుమరుగవుతున్న సంస్కృతీ సంప్రదాయాలను ప్రస్తుత తరానికి తెలిపే విధంగా తీర్చిదిద్దిన రంగవల్లులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రంగు రంగుల ముగ్గులు వేసేందుకు మహిళలు ఉత్సాహంగా పాల్గొనడంతో ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలతో సంక్రాంతి ముందే వచ్చిందా అనేలా సందడి నెలకొంది. మహిళలు తీర్చిదిద్దిన ముగ్గులతో రంగుల హరివిల్లు రూపుదిద్దుకొంది. నంద్యాల పట్టణంలోని టెక్కే మార్కెట్ యార్డులో జరిగిన పోటీలకు మహిళలు ఉత్సాహంగా తరలివచ్చారు. మహిళలు వేసిన రంగుల ముగ్గులు కనువిందు చేశాయి.

- నంద్యాల కల్చరల్ (ఆంధ్రజ్యోతి).









ముగ్గులు వేస్తున్న యువతులు



శ్రీలక్ష్మికి మొదటి బహుమతి ప్రదానం చేస్తున్న అతిథులు బీసీ రాజారెడ్డి తదితరులు

వివరాలు 6లో..



మాట్లాడుతున్న ముఖ్య అతిథి బీసీ రాజారెడ్డి



బహుమతుల ప్రదానోత్సవంలో మహిళలు



శ్రీలక్ష్మి, ప్రథమ బహుమతి



రామేశ్వరమ్మ, ద్వితీయ బహుమతి



ప్రశాంతి, తృతీయ బహుమతి

విద్యార్థులతో కలిసి భోజనం చేయడం నా అదృష్టం

రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ

కోవెలకుంట్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులతో కలిసి భోజనం చేయడం అదృష్టంగా భావిస్తున్నానని మంత్రి బీసీ జనార్దనరెడ్డి అన్నారు. శనివారం కోవెలకుంట్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి బీసీ హాజరై ప్రారంభించారు. ముందుగా కోవెలకుంట్ల జూనియర్ కళాశాలకు చేరుకున్న మంత్రి బీసీకి విద్యార్థులు పూలతో ఘనంగా స్వాగతం పలికారు. ప్రిన్సిపాల్ రమాదేవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి బీసీ మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం అమ్మఒడి పథకం ఇస్తున్నామని చెప్పి జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం రద్దు చేసిందన్నారు. దీంతో పేద విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని తెలిపారు. కూటమి ప్రభుత్వం మంత్రి నారాలోకేశ్ పేద విద్యార్థుల కష్టాలు తెలుసుకుని 475 జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించారన్నారు. కోవెలకుంట్ల జూనియర్ కళాశాలలో ఈ పథకం నా చేతుల మీదుగా ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదలతో చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. జూనియర్ కళాశాలలో ఉన్న సమస్యలన్నీ తాను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచిగా రాణించి బనగానపల్లె నియోజకవర్గానికి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తేవాలని కోరారు. అనంతరం చెన్నంపల్లి భాస్కర్‌రెడ్డి అందించిన నోటుబుక్కులు, పెన్నులను విద్యార్థులకు పంపిణీ చేశారు. తరువాత మధ్యాహ్న భోజన పథకాన్ని మంత్రి బీసీ విద్యా ర్థులకు స్వయంగా వడ్డించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వర ప్రసాదరావు, ఈవోపీఆర్డీ ప్రకాశ్ నాయుడు, ఎంఈవోలు వెంకట్రామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, అధ్యాపకులు, కె.మల్లికార్జునరెడ్డి, గడ్డం నాగేశ్వర్‌రెడ్డి, గువ్వల సుబ్బారెడ్డి, ముస్లిం మైనార్టీ జిల్లా నాయకులు ఎస్‌ఏ గఫూర్, కలుగొట్ల అర్జున్‌రెడ్డి, వల్లంపాటి సర్పంచ్ జగదీశ్వర్‌రెడ్డి, పెనుగొండ రాజశేఖర్, కుళాయిబాషా, గడ్డం అమర్‌నాధరెడ్డి, లాయర్ శ్రీకాంత్, బోదన బాలనాగన్న, బిజినవేముల సుబ్బరాయుడు పాల్గొన్నారు.



కోవెలకుంట్ల జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి బీసీ జనార్దనరెడ్డి

జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం

మంత్రి ఫరూక్



నంద్యాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి తదితరులు

నంద్యాల కల్చరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నామని రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ చెప్పారు. శనివారం నంద్యాలలోని ప్రభుత్వ జూనియర్ మహిళా కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ రాజకుమారి, డీఈవో జనార్దన్‌రెడ్డి, డీవీఈవో సునీత, జూనియర్ కళాశాల, ఉర్దూ కళాశాల పిన్సిపాల్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురికి ప్రాణం పోసిన రైతు

- బ్రెయిన్ డెడ్‌కు గురైన పెద్దయ్య
- లివర్, రెండు కిడ్నీలు దానం చేసిన కుటుంబ సభ్యులు



పెద్దయ్య (ఫైల్)

కర్నూలు హాస్పిటల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ డెడ్‌కు గురైన రైతు ముగ్గురికి ప్రాణం పోశారు. ఆయన లివర్, రెండు కిడ్నీలను కుటుంబ సభ్యులు దానం చేశారు. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న ఇంటి పెద్ద మరణించి పుట్టెడు దుఖంలో ఉన్నప్పటికీ వారి కుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయం అందరికి స్ఫూర్తిదాయకంగా నిలిచింది. వివరాలివీ.. కర్నూలు జిల్లా కల్లూరు మండలం దొడ్డిపాడు గ్రామానికి చెందిన రైతు పెద్దయ్య (59)కు ఈ నెల 2వ తేదీన ఇంట్లో ఉన్న సమయంలో తీవ్రమైన తలనొప్పి వచ్చింది. దీంతో ఆయనను కర్నూలు కిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. రోగిని పరిశీలించిన వైద్యులు తలలో బ్లడ్ క్లాట్ అయినట్లు గుర్తించి రెండు రోజులుగా వైద్యం అందించారు. అయితే శనివారం ఉదయం బ్రెయిన్ డెడ్ అయింది. అవయవదానంపై ఏపీ జీవన్‌ధాన్ సమన్వయకర్త డా.రాంబాబు బృందం రైతు కుటుంబ సభ్యులకు, బంధువులకు అవగాహన కల్పించారు. దీంతో పెద్దయ్య భార్య, కుమారుల అంగీకారంతో లివర్, రెండు కిడ్నీలు దానం చేశారు. ఒక కిడ్నీని కర్నూలు కిమ్స్ హాస్పిటల్‌కు, మరో కిడ్నీని నెల్లూరులోని అపోలో హాస్పిటల్‌కు, లివర్‌ను విజయవాడలోని మణిపాల్ హాస్పిటల్‌కు ఇచ్చారు. ఏపీ జీవన్‌ధాన్ కోఆర్డినేటర్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన గ్రీన్ చానల్ ద్వారా అవయవాలను తరలించారు.




అవయవాలను తరలిస్తున్న వైద్య సిబ్బంది

తుంగభద్ర తీరం

సాహిత్యం





కవులకు, పాఠకులకు మార్గదర్శి

కవి, కథకుడు అయిన కెంగార మోహన్ తాజాగా కవిత్వ విమర్శ పుస్తకం విడుదల చేశారు. ఉపాధ్యాయుడిగా పని చేసే మోహన్ సాహితీ స్రవంతి అనే సుప్రసిద్ధ సంస్థకు రాష్ట్ర అధ్యక్షుడు. గత ఇరవై ఏళ్లుగా సాహిత్య ఉద్యమంలో ఉన్న మోహన్ అనేక పుస్తకాలు రాశారు. ఆ వరుసలో చెమట చెక్కిన వాక్యం అనే విమర్శ గ్రంథం తీసుకొచ్చారు. ఇందులో ఆయన ప్రముఖ కవుల కవితా సంపుటాల దగ్గరి నుంచి ఇటీవలే తొలి కవిత్వ సంపుటి విడుదల చేసిన కవి దాకా పరిగణలోకి తీసుకున్నారు.

ఈ పుస్తకంలో ఆయన ఆధునిక తెలుగు సాహిత్యంలో భిన్న ధోరణులను, ఉద్యమాలకు చెదిన కవిత్వాన్ని పరామర్శించారు. ఒక కవి కవిత్వాన్ని ఎట్లా నిర్మించిందీ, ఏ దృక్పథంలో కవిత్వం రాసిందీ చాలా శ్రద్ధగా పరిశీలించి వివరించే ప్రయత్నం చేశారు. ఒక భావన, అనుభూతి ఎట్లా కవిత్వ రూపం ధరించేదీ వివరించడం వల్ల ఈ పుస్తకంలోని చాలా వ్యాసాలు అటు కవులకేగాక, కవిత్వ పాఠకులకు కూడా ఉపయోగకరంగా ఉంటుంది. కవిత్వాన్ని ఎట్లా చదవాలి? కవిత్వంలోని అర్థాలను ఎట్లా గ్రహించాలి? కవిత్వాన్ని ఎట్లా అనుభూతి చెందాలి? అనేవి కవిత్వ పఠనంలో ముఖ్యమైన అంశాలు. ఇవి తెలియకపోతే పాఠకులు కవిత్వానికి చేరుకవ కాలేరు. విమర్శకులు చాలా వరకు ఈ పని చేసి పాఠకులకు, కవిత్వానికి దూరం తగ్గిస్తుంటారు. కవిత్వాన్ని విప్పిచెప్పడమేగాక కవిత్వాన్ని సొంతంగా అనుభూతిమయం చెందగల సాధారణ మార్గాన్ని సూచిస్తూ ఉంటారు.

కెంగార మోహన్ రాసిన ఈ పుస్తకంలోని వ్యాసాలు చదివినప్పుడు పాఠకులకు ఇలాంటి దారి దొరుకుతుంది. తద్వారా కవిత్వమంటే అర్థంకాని మార్మిక ప్రపంచం అనే అపోహ నుంచి పాఠకులు బైటపడతారు. కవిత్వాన్ని తమ స్వీయానుభవంలో భాగం చేసుకుంటారు. చాలా సరళమైన వాక్యాలతో, తేలిక పద్ధతిలో మోహన్ తన విశ్లేషణ రచన చేశారు. సాహిత్య విమర్శలోని పరామర్శ, పరిచయం దగ్గర మొదలయ్యే ఈ వ్యాసాల్లో కొన్ని చోట్ల మంచి విశ్లేషణ కూడా ఉంది. కవిత్వంలోని వస్తువు, శిల్పం, దృక్పథం మూడింటిపీ మోహన్ దృష్టిలో పెట్టుకొని ఈ పరిచయ వ్యాసాలు రాశారు. అయితే ప్రధానంగా వస్తువు, దృక్పథం, ప్రయోజనం మీద నొక్కు ఉంటుంది. ప్రగతిశీల కవిగా, పాఠకుల కేంద్రంగా తన విమర్శ ఉండాలనే లక్ష్యం పెట్టుకున్నందు వల్ల ఆయన ఈ పద్ధతి పాటించారు.

విమర్శకులతోపాటు, పాఠకులు సమాదరించగల ఈ విమర్శ వ్యాస సంపుటి కర్నూలు జిల్లా సాహిత్యంలో ఒక ప్రత్యేకతను సంతరించుకుంటుంది.

కాలచక్రం



నవచేతన సమ భావన
వెల్లివిరియగా
సప్తస్వర సరిగమలే ఆలపించుదాం
చిరునగవులు పలకరింపు
ఆలంబనగా
కపటపు నటనల ముసుగును
తొలగించుదాం
మానవతా పరిమళాలు వెదజల్లేలా
మనసున మాలిన్యాలను ప్రక్షాళన
చేద్దాం

గుప్పిట చిక్కక కాలము పరుగులు
పెడుతూ
గుప్పెడు గుండెలో గురుతులు ముద్రణ
వేస్తూ
జ్ఞాపకాల ముత్యములను
దోసిట పోస్తూ
పన్నీటిని కన్నీటిని సమముగా
పంచి ఇస్తూ
జీవితమనే వైకుంఠపాళి
ఆటలో
అందలాలు ఎక్కించే నిచ్చెనలు
అధో పాతాళానికి తోసేసే నాగుల
పరీక్షలు
అనంతమైన కాలచక్ర పయనంలో
నా తుది మజిలీ ఏ క్షణమో ఎవరికి
ఎరుక
నిట్టూరుప్పల నిరాశలే గతమునకు
వదిలి
ఆశయాల శ్వాసతో భవితను తలచి
ఊపిరి ఉన్నంతలోనే
సాధన చేసీ
జీవన పరమార్థాన్ని
సాధించుదాం



-డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని, కవయిత్రి, కర్నూలు



కవితలకు ఆహ్వానం

'యువకలం' శీర్షికకు యువకవుల నుంచి 15 లైన్లకు మించ కుండా కవితలను ఆహ్వానిస్తున్నాం. కవితలను పంపవలసిన చిరునామా... **'యువకలం' శీర్షిక, ఆంధ్రజ్యోతి (దినపత్రిక), ఇండస్ స్కూల్ పక్కన, గుత్తి రోడ్, పందిపాడు గ్రామం, కర్నూలు.**

ఆంధ్ర అబ్బాయి.. జపాన్ అమ్మాయి

- ఒక్కటైన కీర్తికుమార్, మట్ సుమోటొ రింక జంట
- కర్నూలు చర్చిలో తల్లిదండ్రుల సమక్షంలో వివాహం



తల్లిదండ్రులతో వధూవరులు కొరకోల కీర్తికుమార్, మట్ సుమోటొ రింక

కర్నూలు కల్చరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర అబ్బాయి.. జపాన్ అమ్మాయి పెళ్లితో ఒక్కటయ్యారు. కర్నూలు నగరంలో చిన్నపార్కు సమీపంలోని సీఎస్ఐ చర్చి ఇందుకు వేదికగా నిలిచింది. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, స్నేహితులు, చర్చి పెద్దల సమక్షంలో వారి వివాహం ఘనంగా జరిగింది. కర్నూలుకు చెందిన కొరకోల కీర్తికుమార్ ముంబై ఐఐటీ నుంచి ఇంజనీరింగ్ పూర్తి ఉద్యోగ రీత్యా జపాన్‌కు వెళ్లారు. అక్కడ టోక్యో సిటీలో ఉద్యోగం చేస్తుండగా, ఆయన టీమ్‌లో ఒకరుగా పనిచేస్తున్న మట్ సుమోటొ రింకతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారింది. నాలుగేళ్ల నుంచి ప్రేమించుకుంటున్న వీరిద్దరూ ఇరు కుటుంబాల పెద్దల అంగీకారంతో వివాహం చేసుకున్నారు.

వివాహానికి నాలుగేళ్లుగా అవగాహన

తమ వివాహానికి సరైన అవగాహన, పెద్దల సమ్మతికి నాలుగేళ్ల సమయం పట్టిందని కొరకోల కీర్తికుమార్ చెప్పారు. ముందుగా ధైర్యం చేసి రింక తన తల్లిదండ్రులు మట్ సుమోటొ రియోకో, మట్ సుమటో తథాకకు ప్రేమ విషయం తెలియజేశారు. వారు ఆమెతో ఇండియా వెళ్లి అక్కడ నీవు ఉండగలవో లేదో చూసి రమ్మని చెప్పారు. అలా ఆమె ఇండియాకు వచ్చి, కొంతకాలం ఉండి తర్వాత తల్లిదండ్రులకు తన ఇష్టాన్ని తెలియజేసింది. కీర్తికుమార్ తల్లిదండ్రులు కొరకోల ప్రేమమ్మ, కొరకోల ప్రేమ్‌కుమార్ కూడా వారి ప్రేమకు పచ్చజెండా ఊపారు. దీంతో తల్లిదండ్రుల సమక్షంలో, సీఎస్ఐచర్చిలో, చర్చి పాస్టర్లు సంప్రదాయబద్ధంగా కీర్తికుమార్, రింకల వివాహం జరిపించారు.

అవనిపై హరివిల్లు



ముగ్గులు వేస్తున్న మహిళలు

నంద్యాల కల్చరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఆధ్వర్యంలో శనివారం నంద్యాలలోని టెక్కె మార్కెట్ యార్డులో ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలకు మహిళల నుంచి విశేష స్పందన లభిచింది. 92 మంది మహిళలు వేసిన ముత్యాల ముగ్గులు మురిపించాయి. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమైన పోటీలు 12.00 గంటల వరకు జరిగాయి. రెండు గంటల వ్యవధిలో మహిళలు రంగువల్లులను అందంగా, చుక్కలతో తీర్చిదిద్దారు. చుక్కలతో, సహజసిద్ధంగా, సంస్కృతికి అద్దం పడుతూ ముగ్గులను తీర్చిదిద్దారు. ఉదయం నిర్దేశించిన సమయానికి గంట ముందుగానే వచ్చి తమ తమకు కేటాయించిన స్థలాల్లో పేడతో అలికి సిద్ధం చేసుకున్నారు. ఇళ్ల దగ్గరి నుంచే రంగులను ముగ్గులకు సిద్ధం చేసుకొని వచ్చారు. మరి కొందరు మహిళలు గొబ్బెమ్మలు, రకరకాల రంగుల్లో ఉన్న పూలను, చెరకు గడలను, నవధాన్యాలను వెంట తెచ్చుకొని తాము వేసిన ముగ్గులను మరింత అందంగా తీర్చిదిద్దారు. ముత్యాల ముగ్గుల పోటీలకు న్యాయనిర్ణేతలుగా ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్, శివలావణ్య, మణిమంజరి వ్యవహరించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు ముఖ్య అతిథి బీసీ రాజారెడ్డి బహుమతులను అందజేశారు. మొదటి బహుమతిగా రూ.6వేలు, రెండో బహుమతిగా రూ.4 వేలు, మూడో బహుమతిగా రూ.3వేలు అందజేశారు. అదేవిధంగా నాలుగు, ఐదు బహుమతులుగా రూ.2,500 చొప్పున అందజేశారు. వీటితో పాటు పదిమందికి కన్సోలేషన్, పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు బ్రాంచ్ మేనేజర్ లక్ష్మణ్, ఎడిషన్ ఇన్‌చార్జి చల్లా నవీన్‌కుమార్ నాయుడు, బ్యూరో ఇన్‌చార్జి గోరంట్ల కొండప్ప, స్టాఫ్ రిపోర్టర్ సి.గోపాలకృష్ణ, యాడ్స్ అసిస్టెంట్ మేనేజర్ గోపాల్, ఏబీఎన్ ప్రతినిధి సుంకన్న తదితరులు పాల్గొన్నారు.



బీసీ రాజారెడ్డిని సన్మానిస్తున్న ఆంధ్రజ్యోతి సిబ్బంది

సంప్రదాయాలను కాపాడుకుందాం

బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుకోవడంలో మహిళలు కీలక భూమిక పోషించాలని బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల కంటే రాయలసీమ సంస్కృతీ, సంప్రదాయాలు భిన్నంగా ఉంటాయన్నారు. రాయలసీమలో పండుగలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని, సీమ ప్రజలు ఉన్నంతలో పండుగలను గొప్పగా చేసుకుంటారన్నారు. కుటుంబంతో పాటు సమాజాన్ని చక్కదిద్దగలిగే శక్తి ఒక్క మహిళకే ఉందన్నారు. కన్న పిల్లలను మార్కులు తెచ్చే యంత్రాలుగా కాకుండా ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. పిల్లలు మారాం చేస్తే సెల్‌ఫోన్లు ఇచ్చి బుజ్జగించే విష సంస్కృతికి స్వస్తి పలకాలన్నారు. మన బిడ్డలకు మానవీయ విలువలతో పెంచితేనే వృద్ధాప్యంలో అనాథ ఆశ్రమాల్లో వదిలేయకుండా బాగా చూసుకుంటారన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించడం దేశం గొప్పతనమన్నారు. ముగ్గుల పోటీలకు స్పాన్సర్ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు బీసీ రాజారెడ్డి తెలిపారు.

రాష్ట్ర స్థాయిలో బహుమతి సాధించాలని ఉంది

నంద్యాల జిల్లాస్థాయి ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి సాధించినందుకు సంతోషంగా ఉంది. ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముగ్గుల పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైతే అక్కడ రాణించి మొదటి బహుమతి సాధించాలని ఉంది. గతంలో రాష్ట్రస్థాయికి ఎంపికై విజయవాడలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్నాను. ఈ ఏడాది ముగ్గుల పోటీలు ఉత్సాహంగా, ఉత్కంఠ భరితంగా జరిగాయి.

-శ్రీలక్ష్మి, నంద్యాల, ప్రథమ బహుమతి విజేత

ఆంధ్రజ్యోతికి ప్రత్యేక కృతజ్ఞతలు

మహిళలను ప్రోత్సహించడంలో భాగంగా ప్రతి సంవత్సరం ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న ఆంధ్రజ్యోతి, ఏబీఎన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. మహిళలు పోటాపోటీగా తీర్చిదిద్దిన రంగవల్లుల్లో ప్రత్యేక స్థానం సాధించి ద్వితీయ బహుమతిని కైవసం చేసుకోవడం ఆనందంగా ఉంది.

- రామేశ్వరమ్మ, బేతంచర్ల, ద్వితీయ బహుమతి విజేత

ఏటా పాల్గొంటున్నాను

ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ఏటా నిర్వహిస్తున్న ముత్యాల ముగ్గుల పోటీల్లో ప్రతిసారి పాల్గొంటున్నాను. మహిళల్లో పోటీతత్వాన్ని పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయి. తెలుగుదనం ఉట్టిపడేలా ముగ్గులు వేయడం ఎంతో ఇష్టం.

- ప్రశాంతి, పాణ్యం, తృతీయ బహుమతి విజేత





మాట్లాడుతున్న అతిథులు



ముగ్గులు వేస్తున్న మహిళలు



40 ఎకరాల్లో పుట్టగొడుగుల పరిశ్రమ

ప్రత్యేక బాక్సుల్లో తరలింపు

- 2018లో ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- మార్కెట్‌లో ఓర్వకల్లు పుట్టగొడుగులకు భలే గిరాకీ
- రోజూ పది టన్నుల మేర ఉత్పత్తి
- స్థానికులకూ ఉపాధి అవకాశాలు మెరుగు

ఓర్వకల్లు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : వేల ఏళ్ల క్రితం ఈజిప్టును పరిపాలించిన ఫారోలు పుట్టగొడుగుల రుచిని ఆస్వాదించారు. ప్రాచీన కాలంలో గ్రీకులు, రోమన్లు వీటిని సైనికులకు ఆహారంగా పెట్టేవారు. పుట్టగొడుగులు మొక్కల జాతికి కాకుండా శిలీంద్రాల కిందికి వస్తాయి. దాంతో ఇప్పటికీ వీటి గురించి తెలియని చాలామంది ఇవంటే అయిష్టత చూపుతున్నారు. అయితే ఎన్నో ఔషధగుణాలు, పోషక విలువలు కలిగి, కమ్మని రుచితో ఆరోగ్యానికి హామీ ఇచ్చే పుట్టగొడుగులు నిజంగానే ఓ సూపర్ ఫుడ్. కర్నూలు జిల్లాలోనే ఈ పుట్టగొడుగులను ఓ భారీ పరిశ్రమలో కృత్రిమ పద్ధతిలో సాగు చేస్తున్నారు.



పుట్టగొడుగులను కోస్తున్న కూలీలు

కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండల పరిధిలోని కాల్వ గ్రామం నుంచి కొమ్ముచెరువు ఆంజనేయస్వామి దేవస్థానానికి వెళ్లే దారి పక్కనే (ఫ్రెష్ బౌల్ హార్టికల్చర్ ప్రైవేట్ లిమిటెడ్) పేరుతో పుట్టగొడుగుల పరిశ్రమ ఉంది. 2017లో సుమారు 40 ఎకరాల విస్తీర్ణంలో పుట్టగొడుగుల పెంపకానికి శ్రీకారం చుట్టారు. 2018లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ పరిశ్రమను లాంఛనంగా ప్రారంభించారు. మొదటి విడతలో రూ.40 కోట్లు, రెండో విడతలో రూ.85 కోట్లతో యాజమాన్యం పనులు మొదలుపెట్టింది. ఇతర రాష్ట్రాల వారు, స్థానికులతో కలిపి అగ్రికల్చర్ డిప్లమో ఉద్యోగులు, కూలీలు మొత్తం 370 మంది సిబ్బంది ఈ పరిశ్రమలో పని చేస్తూ ఉపాధి పొందుతున్నారు. ఈ పరిశ్రమలో ప్రత్యేకంగా బటన్ రకం పుట్టగొడుగులను కృత్రిమ పద్ధతిలో పండిస్తున్నారు. ఒక పుట్టగొడుగు పెద్దగా కావడానికి 15 రోజుల సమయం పడుతుంది. ఇలా రోజుకు 10 టన్నుల దాకా పంటను ఉత్పత్తి చేసి తెలుగు రాష్ట్రాలతో పాటు, కర్నాటక, తమిళనాడు తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. అలాగే కర్నూలు, నంద్యాల, బేతంచెర్ల, బనగానపల్లె పట్టణాలతో పాటు, ఓర్వకల్లు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు పరిశ్రమ వద్దకు వెళ్లి పుట్టగొడుగులను కొనుగోలు చేస్తున్నారు. పరిశ్రమ యాజమాన్యం వర్మీకంపోస్ట్ ఎరువును రైతులకు ఉచితంగా అందిస్తున్నారు. దీంతో పరిశ్రమ యాజమాన్యాన్ని రైతులు అభినందిస్తున్నారు. పుట్టగొడుగుల పరిశ్రమను ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, రైతులు సందర్శించి పుట్టగొడుగుల తయారీని పరిశీలించి అవగాహన పెంచుకుంటున్నారు.

పోషకాల పుట్టగొడుగులు

పలు రకాల పుట్టగొడుగులు మార్కెట్‌లో ప్రతిచోటా లభ్యమవుతున్నాయి. పుట్టగొడుగు శాస్త్రీయ నామం అగారికస్ బిస్పోరస్. వీటిలో ప్రొటీన్స్, బి.కాంప్లెక్స్, సి, డి విటమిన్లు, ఫైబర్, జింక్, కాపర్, మాంగనీస్ పుష్కలంగా ఉంటాయి. క్యాన్సర్, కొలెస్ట్రాల్‌లను తగ్గించి, రోగనిరోధక శక్తిని పెంచే లక్షణాలు ఈ పుట్టగొడుగుల్లో ఉన్నాయి. అంతేగాక మెదడు, పేగులను పుట్టగొడుగులు చైతన్యపరుస్తాయి. ఇంతటి ప్రయోజనాలున్న పుట్టగొడుగులకు ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది.

యాంటీ ఆక్సిడెంట్ల గని



పుట్టగొడుగుల్లో యాంటీ ఆక్సిడెంట్ సెలీనియంలు ఎక్కువ. వీటిలో ఎర్గోథియోనైన్ అనే యాంటీఇన్‌ఫ్లమేటరీ సూక్ష్మపోషకం ఉంటుంది. ఇది మన శరీర కణాలను రక్షిస్తుంది. వండినప్పుడు ఇది పుట్టగొడుగుల నుంచి విడుదలవుతుంది. పుట్టగొడుగులు శరీరంలో తెల్ల రక్తకణాల వృద్ధిని ప్రేరేపిస్తాయి. ఇవి తేలిగ్గా అరిగిపోతాయి. పొట్ట సమస్యలను, పేగుల్లో ఆహారం నిల్వ ఉండటాన్ని తొలగించేస్తాయి. వీటిలో ఫైబర్ ఎక్కువ, క్యాలరీలు తక్కువగా ఉండటంతో శరీరంలో క్యాలరీల భారాన్ని తగ్గించి బరువు తగ్గడానికి సహాయపడతాయి. పుట్టగొడుగులు కాలేయానికి టానిక్ లాంటివి. ఊపిరితిత్తుల ఆరోగ్యాన్నీ కాపాడుతాయి. ఆస్తమా, ఇతర శ్వాసకోశ సమస్యలను అదుపులో ఉంచుతాయి. అంతేకాదు డయాబెటిస్ రోగులకు అవసరమైన ఇన్సులిన్ హార్మోన్‌ను స్రవించే క్లోమగ్రంథి పనితీరును మెరుగుపరుస్తాయి. కాబట్టి మధుమేహ రోగులకు కూడా ఇవి మంచి ఆహారమే. దీర్ఘకాలిక ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమితో బాధపడేవారికి కూడా పుట్టగొడుగులు గొప్పగా పనిచేస్తాయి.

పుట్టగొడుగుల పెంపకంపై రైతులను చైతన్యపరచాలి



పుట్టగొడుగులు మంచి పోషకాలు ఉన్న ఆహారం. వీటి పెంపకం మంచి కుటీర పరిశ్రమ. వర్షాకాలంలో తేమగా ఉండే ప్రాంతాల్లో పెరిగే వీటిని కృత్రిమపద్ధతుల్లో పెంచవచ్చు. తక్కువ పెట్టుబడితో మంచి లాభాలు ఆర్జించవచ్చు. పుట్టగొడుగుల పెంపకంపై రైతులను, యువతను ప్రభుత్వం చైతన్య పరచాలి. ఓర్వకల్లు మండలంలో రైతులు, యువత పుట్టగొడుగుల పెంపకంపై ఆసక్తి చూపిస్తే మా పరిశ్రమ ద్వారా వర్మీకంపోస్ట్ ఎరువును ఉచితంగా అందిస్తాం.

- డాక్టర్ వీకేవీ ప్రసాద్, పరిశ్రమ ఎండీ

కాల్వ గ్రామానికి మౌలిక వసతులు కల్పిస్తున్నారు



గ్రామ సమీపాన ఉన్న పుట్టగొడుగుల పరిశ్రమ యాజమాన్యం గ్రామంలో ఏ సమస్య ఉన్నా తక్షణమే స్పందించి పనులు చేయడం జరుగుతుంది. అలాగే గ్రామ రైతులకు ఉచితంగా వర్మీ కంపోస్టును కూడా అందిస్తున్నారు. పరిశ్రమ ఏర్పడటంతో గ్రామం ఎంతో అభివృద్ధి చెందుతుంది.

- ఖాదర్‌బాషా రైతు, కాల్వ గ్రామం

ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు



పుట్టగొడుగుల పరిశ్రమలో గ్రామంలో ఉన్న నిరుద్యోగ యువతకు పరిశ్రమ యాజమాన్యం ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగింది. గ్రామంలో ఉన్న కూలీలకు కూడా పరిశ్రమలో పనులు పుష్కలంగా ఉన్నాయి. గ్రామ సమీపాన పరిశ్రమ ఏర్పడటంతో భూములకు మంచి గిరాకీ వచ్చింది.

- నాగిరెడ్డి ఎంపీటీసీ, కాల్వ గ్రామం

గంజాయి కేసులో నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

నంద్యాల క్రైం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు డీఎస్పీ పి.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నంద్యాల తాలుకా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.ఈశ్వరయ్య, ఎస్ఐ ఎస్.గంగయ్య యాదవ్, ఏఎస్సై కె.హరినాథరెడ్డి సిబ్బంది శనివారం గంజాయి కేసులో నిందితులను అరెస్ట్ చేశారు. శిరివెళ్ల మండలం బోయలకుంట్ల గ్రామానికి చెందిన జింకల మద్దిలేటి, మహదేవపురంకు చెందిన బొంత శ్రీనివాసులు, నంద్యాల మండలం అయ్యలూరు మెట్టకు చెందిన షేక్ యూసుఫ్‌లను శనివారం సాయంత్రం 4.30గంటల ప్రాంతంలో అరెస్ట్‌చేసి వారి వద్ద నుంచి 5కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఏ1 నిందితుడైన జింకల మద్దిలేటికి సామర్లకోటకు చెందిన వాసు అనే వ్యక్తితో పరిచయం ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. వాసు సహాయంతో ప్రధాన నిందితుడు జింకల మద్దిలేటి రైలు ద్వారా గంజాయిని తెప్పించుకొని నంద్యాల, చుట్టుపక్కల గ్రామాలలో ఏ2 నిందితుడు బొంత శ్రీనివాసులుతో కలిసి గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి అమ్ముకొని సొమ్ము చేసుకుంటుండేవారన్నారు. శనివారం ఏ3 నిందితుడు షేక్ యూసుఫ్‌కు గంజాయి ఇస్తుండగా నంద్యాల తాలుకా పోలీసులు దాడిచేసి పట్టుకున్నట్లు చెప్పారు. ఏ1 నిందితుడు జింకల మద్దిలేటిపై గతంలో అవనిగడ్డలో, మహానంది పోలీస్ స్టేషన్ లోనూ గంజాయి కేసులున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల అరెస్ట్‌లో కీలకపాత్ర పోషించిన నంద్యాల తాలుకా సీఐ ఆర్.ఈశ్వరయ్య, ఎస్సై ఎస్.గంగయ్య యాదవ్, ఏఎస్ఐ కె.హరినాథరెడ్డి, హెడ్‌కానిస్టేబుళ్లు చంద్రశేఖర్, పి.అయూబ్‌ఖాన్, పోలీస్ కానిస్టేబుళ్లు డి.జిలానిబాష, రామ్‌గోపాల్, పీవీకేనాయుడు, గంగాధర్‌లను ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, డీఎస్పీ పి.శ్రీనివాస రెడ్డి అభినందించారు. గంజాయికి సంబంధించి 1972 నెంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలని పోలీస్ అధికారులు ప్రజలను కోరారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని వారు తెలిపారు

9న వేలం పాట

కర్నూలు అర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మద్యం డిపోలో ఫ్రీజర్స్-93, ఇన్వర్టర్ బ్యాటరీలు-96, స్కానర్స్-192, క్యాస్ కౌంటింగ్ మిషన్స్-70, వేలం ప్రక్రియ ద్వారా అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని డిపో మేనేజర్ విజయకుమార్ తెలిపారు. ఈ నెల 9న 10 గంటలకు డిపోలో వేలం ప్రక్రియలో పాల్గొన దలచిన వారు రూ.5 వేల ముందస్తు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చు అన్నారు.

జిల్లాలో 305 డెంగీ కేసులు

- మలేరియా జోనల్ అధికారి

కర్నూలు హాస్పిటల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2024లో 305 డెంగీ, 17 మలేరియా కేసులు నమోదైనట్లు జోనల్ మలేరియా అధికారి డా.లక్ష్మణ్ నాయక్ తెలిపారు. శనివారం కర్నూలుకు వచ్చిన ఆయన జిల్లాలోని వ్యాధి నిర్ధారణను పరిశీలించారు. ముందుగా డాక్టర్స్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని అరోరానగర్‌లో జోనల్ మలేరియా అధికారి పర్యటించారు. డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, ఫైలేరియా నివారణకు ప్రజలు తమ ఇంటి వద్ద పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవలని సూచించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి చంద్రశేఖర్‌తో కలిసి చికెన్ గున్యా లక్షణాలపై అవగాహన కల్పించారు. వైద్యులు డాక్టర్ సునీల కుమారి, ఎంటమాలజిస్టు వెంకటేశ్వర్లు, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

మాయమాటలతో రూ.21 లక్షల బురిడీ

- ఒకరి అరెస్టు.. పరారీలో మరికొందరు



నిందితుడిని చూపుతున్న పోలీసులు

పెద్దకడుబూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): 'డబ్బులను వర్షంలా కురిపిస్తాం..మీ దగ్గర ఉన్న డబ్బులను రెట్టింపు చేస్తాం.. రైస్ పుల్లింగ్ ద్వారా అధికంగా డబ్బులు సంపాదించకోవచ్చు' అంటూ కొందరు బాబాలు బురిడీ కొట్టించారు. రూ.21 లక్షలతో మోసం చేశారు. సీఐ మంజునాథ్, ఎస్ఐ నిరంజన్ రెడ్డి వివరాల మేరకు.. మహబూబ్ నగర్ జిల్లా శాశంపల్లి గ్రామానికి చెందిన సందుల రవి మండలంలోని హెచ్ మురవణి గ్రామానికి చెందిన వెంకటేష్ దగ్గర రూ.21 లక్షలు తీసుకొని రెట్టింపు చేస్తామని చెప్పి మోసం చేశాడు. వెంకటేష్ వారి మాయమాటలు నమ్మి రూ.21 లక్షలను ట్రంకు పెట్టెలో పెట్టాడు. తర్వాత సందుల రవి, పూజారులు కలిసి పూజకు పూనుకున్నారు. మధ్యలో ఓ వస్తువును తీసుకురమ్మని వెంకటేష్‌ను బయటకు పంపారు. ఆ సమయంలో ట్రంకు పెట్టెలోని డబ్బు న్న తీసుకొని వాటి స్థానంలో పేపర్లు పెట్టారు. పూజ అనంతరం పెట్టెను ఇక్కడే ఉంచి నదీ స్నానం చేయాల్సి ఉంటుందని నమ్మించి మంత్రాలయం వెళ్లారు. అక్కడ నదీ స్నానాలు చేశారు. నీవు ట్రంకు పెట్టెపై నదీజలాన్ని చల్లి తెరిచి చూస్తే డబ్బు రెట్టింపై ఉంటుందని చెప్పారు. నీవు ట్రంకు పెట్టెను చూసిన తర్వాత మరలా నీవు తిరిగి రావాలని చెప్పి పంపారు. దీన్ని నమ్మిన బాధితుడు వెంకటేష్ ఇంటికి వెళ్లి ట్రంకు పెట్టెను తెరిచి చూడగా పేపర్లు కనిపించాయి. అందులోని రూ.21 లక్షలు కనిపించకపోవడంతో మోసపోయానని తెలుసుకొని నిందితులు సందుల రవితోపాటు మరో నలుగురికి ఫోన్ చేయగా స్విచ్చాఫ్ అని వచ్చింది. మోసపోయానని తెలుసుకొని పెద్దకడుబూరు పోలీస్ స్టేషన్‌కు చేరుకొని ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పెద్దకడుబూరు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి విచారణ చేపట్టి నిందితుల్లో సందుల రవిని అరెస్టు చేయగా మిగతావారు పరారీలో ఉన్నట్లు ఆయన తెలిపారు.

రూ.20 కోట్ల భూమిని కాజేశారు..!

- బతికున్న వ్యక్తి చనిపోయినట్లుగా మరణ ధ్రువీకరణ పత్రం సృష్టి
- ఆపై అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి వేరొకరికి రిజిస్ట్రేషన్

ఆదోని, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రూ.20 కోట్ల భూమిని కాజేశారు. మండగిరిలో నివాసముంటున్న ఎగ్గటి ఈశ్వరప్పకు బైపాస్ సమీపంలోని సర్వే నెంబర్ 321-ఏలో 6.51 ఎకరాల భూమి వారసత్వంగా వచ్చింది. నేషనల్ హైవే పొలంలోనే వెళ్లడంతో భూమి ధరలు పెరిగి పోయాయి. మార్కెట్‌లో ఎకరా రూ.3 నుంచి రూ.4కోట్లు పలుకుతుండటంతో దానిపై కూటమికి చెందిన ఓ నాయకుడి కన్నుపడింది. దీంతో భూయజమాని ఎగ్గటి ఈశ్వరప్ప 2009లో మృతి చెందినట్లు నకిలీ డెత్ సర్టిఫికెట్ పుట్టించారు.

నంద్యాల పట్టణం లోని ఉప్పరిపేటలో నివాసం ఉంటున్న లేట్ ఎగ్గటి ఈశ్వరప్ప, కేరఫ్ ఆముదాల సుబ్బరాయుడు కుమా రుడు ఆముదాల భాస్కర్ ఆ పొలంపై సర్వాధికారాలు తనవి అన్నట్లుగా డాక్యుమెంట్లు తయారు చేసుకొని గోనెగండ్ల మండలం పెద్ద మర్రివీడు గ్రామానికి చెందిన చాకలి కర్రెన్న గారి కుమారుడు ఈరన్నకు 2024 డిసెంబరు 31వ తేదీన ఆగమేఘాల మీద ఆదోని సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించి, అనంతరం ప్లాట్లు వేశారు. సమాచారం తెలుసుకున్న రైతు ఎగ్గటి ఈశ్వరప్ప సబ్ రిజిస్టర్ కార్యాలయంలో విచారించి, రిజిస్ట్రార్‌కు తన భూమి డాక్యుమెంట్లు చూపించారు. బతికున్న వ్యక్తి చనిపోయినట్లు డెత్ సర్టిఫికెట్ ఎలా పుట్టించారని ఈశ్వరప్ప కుమారులు మోహన్ కుమార్, సునీల్ కుమార్ నిలదీశారు. దీంతో రిజిస్ట్రార్ కార్యాలయంలో కొద్దిసేపు గందరగోళ వాతావరణం కనిపించింది. సబ్ రిజిస్ట్రార్, జూనియర్ అసిస్టెంట్ రమేష్ డాక్యుమెంటు సిద్ధం చేయాలని తనకు చెప్పడంతోనే చేశానని, తనకు తనకు సంబంధం లేదని డాక్యుమెంట్ రైటర్ మహబూబ్ వివరించారు. బతికున్న వ్యక్తి 2009లో మృతి చెందినట్లు నకిలీ డెత్ సర్టిఫికెట్ పుట్టించి రిజిస్టర్ ఎలా చేశారని, అందులో ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్ కూడా కరెక్ట్‌గా లేదని సబ్ రిజిస్ట్రార్ హాజీమియాను బాధతులు నిలదీశారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ రికార్డులను పరిశీలించి, ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. బాధితుడు ఈశ్వరప్ప కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సబ్ రిజిస్ట్రార్ హాజీ మియాను వివరణ కోరగా.. డాక్యుమెంట్లు అధికంగా వస్తున్నాయని, దీనిని సరిగా చూడలేదని, రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తామన్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి, నిందితులపై కేసు నమోదు చేసి, బాధితులకు న్యాయం చేస్తామన్నారు.



సబ్ రిజిస్ట్రార్, సిబ్బందితో బాధితుల వాగ్వాదం



బైఠాయించిన బాధితుడు

సబ్ రిజిస్ట్రార్‌తోపాటు ఐదుగురిపై కేసు నమోదు

ఆదోని పట్టణంలోని ఎగ్గటి ఈశ్వరప్పకు చెందిన క్రమ సంఖ్య 321-ఏలో ఉన్న 6.51 ఎకరాలను నకిలీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ చేయించచయాకరి బాధితుడి ఫిర్యాదు మేరకు... సబ్ రిజిస్ట్రార్ హాజీ మియాతో పాటు సీనియర్ అసిస్టెంట్ ఈరన్న, జూనియర్ అసిస్టెంట్ రమేష్, డాక్యుమెంట్ రైటర్ మహబూబ్, పొలాన్ని అమ్మిన వ్యక్తి ఆముదాల భాస్కర్, కొన్నవ్యక్తి చాకలి ఈరన్నపై భారతీయ న్యాయ సంహిత కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ సోమన్న తెలిపారు.

ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీకి చోటు

- ట్రాన్స్‌కోకు అదనంగా 10,800 మెగావాట్ల విద్యుత్ సమకూరే అవకాశం
- సబ్‌స్టేషన్లు, లైన్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి
- ఐదేళ్ల విద్యుత్ ప్లాన్‌కు ఆమోదం తెలిపిన ఫోరం

కల్లూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల విద్యుత్ ప్రణాళికలో భాగంగా ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ(ఐసీఈ) పాలసీకి చోటు లభిం చింది. 2024 అక్టోబరు 21న జరిగిన ఏపీ ఈఆర్సీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఐసీఈపై విస్తృత స్థాయి చర్చ, అవసరమైన మార్పులు, చేర్పులతో రాష్ట్ర సమన్వయ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ పాలసీ దేశంలో రాష్ట్రాన్ని పునరుత్పాదక పంప్ హైడ్రో సోరేజీ హబ్‌గా మారు స్తుందన్న ఆశాభావాన్ని కమిషన్ వ్యక్తం చేసింది. శనివారం జిల్లా కేంద్రంలోని ఏపీఈఆర్సీ భవన్‌లో ఇన్‌చార్జ్ చైర్మన్ ఠాకూర్ రామ్‌సింగ్ అధ్యక్షతన ఏపీ ట్రాన్స్‌కో 5వ విద్యుత్ రాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ట్రాన్స్‌కో చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ విజయానంద్, ఏపీసీపీడీసీఎల్ సీఎండీ రవి పట్టంశెట్టి, ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి హాజరై 2024-2025 నుంచి 2028-29 ఆర్థిక ఏడాదికి సంబంధించి రాష్ట్ర విద్యుత్ ప్రణాళికపై చర్చించి ఆమోదం తెలిపారు. స్టేట్ ట్రాన్స్ మిషన్ యుటిలిటీ(ఎస్‌టీయూ) ఏపీ ట్రాన్స్‌కో, ఏపీఈఆర్సీ లోడ్ ఫోర్‌కాస్ట్ , రిసోర్స్ ప్లాన్ మార్గదర్శకాల మేరకు ప్రతి ఐదేళ్లకు నియంత్రణ వ్యవధి కోసం లైసెన్స్ దారుల లోడ్ సూచన, వనరుల ప్రణాళి కలకు ఆమోదం తెలపాల్సి ఉంటుంది. అందులో భాగంగా ఏర్పాటైన సమావేశంలో విద్యుత్ ఉత్పత్తి, ప్రసారం, పంపిణీ, సరఫరాను ప్రోత్సహించడానికి ఏపీజెన్‌కో, ఏపీ డిస్కమ్‌లతో చర్చించారు. తద్వారా సమావేశంలో ఆమోదం పొందిన ఐఈసీ పాలసీ ద్వారా ఏపీట్రాన్స్‌కోకు అదనంగా 10,800 మెగావాట్ల విద్యుత్ సమకూరుతుందని భావిస్తున్నారు. ఫోరం ఏపీట్రాన్స్‌కో రూపొందించిన స్టేట్ ఎలక్ట్రిసిటీ ప్లాన్‌పై సమీక్ష నిర్వహించి దానిని ప్రచురించడానికి ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ఏపీఈఆర్సీ ఇన్‌చార్జ్ చైర్మన్ ఠాకూర్ రామ్‌సింగ్ మాట్లాడుతూ రాబోయే వేసవిలో నిరంతరాయంగా విద్యుత్‌ను సరఫరా చేయాల్సిన నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. రబీ పంటలకు కరెంట్ కోతలు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. విద్యుత్ ప్రమాదాలు పెరిగిపో తుండటంతో భద్రతా చర్యలను పెంచి పంపిణీ వ్యవస్థను పునరుద్ధరించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రమాద కేసులు తగ్గుముఖం పట్టేలా చూడాలని మృతుల కుటుంబాలకు పరిహారం అందేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఈఆర్సీ సభ్యుడు పీవీఆర్.రెడ్డి, ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీలు పృథ్వితేజ్, సంతోషరావు, జెన్‌కో చీఫ్ ఇంజనీర్ అశోక్‌కుమార్, ఎన్‌టీపీసీ జనరల్ మేనేజర్ రోహిత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఎస్, ఇన్‌చార్జి చైర్మన్

క్లస్టర్ వర్సిటీలో ఇస్రో నోడల్ ఆఫీసు

కర్నూలు అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇస్రో భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ స్టార్స్ ఆన్‌లైన్ నోడల్ ఆఫీసుగా క్లస్టర్ యూనివర్సిటీ ఎంపికైందని ఉపకులపతి డీవీఆర్ సాయిగోపాల్ తెలిపారు. యూజీపీజీ విద్యార్థుల కోసం ఈ ఆన్‌లైన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ప్రయోజనాన్ని ఇస్తుందని ఇలాంటి అవకాశం క్లస్టర్ యూనివర్సిటీకి రావడం సంతోషించదగ్గ విషయమని రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ శిక్షణ ఈ నెల 9 నుండి 31 వరకు జరుగుతుందని, ఆసక్తి గల డిగ్రీ చదువుతున్న విద్యార్థులు క్లస్టర్ యూనివర్సిటీలో సంప్రదించాలని కోరారు. ఈ ట్రైనింగ్ ప్రోగామ్‌కు నోడల్ సెంటర్ కోఆర్డినేటర్‌గా డాక్టర్ ఎం పద్మావతి, నిర్వాహక సభ్యులుగా డాక్టర్ వాయిజ్, డాక్టర్ మహబూబ్ బాషా, డాక్టర్ లక్ష్మణ్ గుప్తా నియమించబడ్డారు.

ఘనంగా స్వర్ణోత్సవాలు

- వేలాదిగా తరలివచ్చిన పూర్వ విద్యార్థులు
- విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు సన్మానం



అధ్యాపకుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే, పూర్వ విద్యార్థులు

ఆత్మకూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవ వేడుకలు అంబరాన్ని అంటాయి. 1974లో ఏర్పాటైన ఈ కళాశాల 50 ఏళ్లను పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా రెండు రోజులపాటు జరిగే స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా తొలి రోజైన శనివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థుల ఆనందాలకు అవధుల్లేకుండా పోయాయి. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు అలనాటి మధుర జ్ఞాపకాలతో, తోటి స్నేహితులతో పులకించారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై స్వర్ణోత్సవ వేడుకల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. తదుపరి కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన సమావేశాన్ని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కష్టపడితే దేన్నైనా సాధించవచ్చునన్న విషయానికి ప్రస్తుత పూర్వ విద్యార్థులను చూస్తే అర్థమవుతుందన్నారు. అప్పట్లో ఎలాంటి సదుపాయాలు లేనప్పటికీ కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవడం మామూలు విషయం కాదన్నారు. త్వరలోనే ఇంజనీర్ కళాశాల కోసం ప్రతిపాదనలు తయారు చేయిస్తానని తెలిపారు. విశ్రాంత ఐఏఎస్ ఆఫీసర్ రాంపుల్లారెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో కళాశాల విద్యార్థులను ప్రోత్సహించేలా ప్రతిఏటా విద్యార్థులకు నగదు పారితోషికాలు ఇస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. తనవంతుగా రూ.2 లక్షల విరాళాన్ని ప్రకటించారు. మరో విశ్రాంత ఐఏఎస్ అధికారి జగన్నాథం మాట్లాడుతూ.. తమ కళాశాల స్వర్ణోత్సవ వేడుకలు జరుపుకోవడం చూస్తూ గాల్లో తేలిపోయినంత ఆనందం కల్గుతోందని అన్నారు. అనంతరం కళాశాల పూర్వ విద్యార్థి, పారిశ్రామికవేత్త ఆవుల నారాయణరెడ్డి కళాశాల అభివృద్ధికి రూ.15లక్షల విరాళాన్ని అందజేశారు. అలాగే విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం అలనాటి అధ్యాపకులను సత్కరించారు. వేడుకకు విచ్చేసిన వారందరికి శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి రెండు రోజుల పాటు భోజన సదుపాయాన్ని కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రఘురామాచార్యులు, డీఆర్‌డీఏ శాస్త్రవేత్త వీరబ్రహ్మం, కళాశాల స్థలదాత కుటుంబీలు వెన్నా భోగిరెడ్డి, డాక్టర్లు గోవిందరాజులు, డాక్టర్ శంకర శర్మ, డాక్టర్ గౌరీనాథ్ ఉన్నారు.

ఆనందంగా ఉంది



నేను అధ్యాపకునిగా పని చేసిన కళాశాల స్వర్ణోత్సవ వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉంది. విద్యార్థులు ప్రయోజకులుగా మారారు. రాణించిన విద్యార్థులకు నగదు పారితోషికాలు ఇవ్వడం వారిలో మరింత స్ఫూర్తినింపుతోంది.

- కుమార్, ఫస్ట్ బ్యాచ్ బాటనీ అధ్యాపకుడు

సంతోషంగా ఉంది



కళాశాల స్వర్ణోత్సవ వేడుకలను జరుపుకోవడం సంతోషంగా ఉంది. కుమార్ సార్ మార్గదర్శకాలే ఉన్నత స్థాయిలో నిలిపాయి.

- డాక్టర్ శంకర్‌శర్మ, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు, కర్నూలు

కొందరు లేక బాధ..



మా బ్యాచ్‌లో 148 మంది ఉండగా, కొందరు స్నేహితులు లేకపోవడం బాధేస్తోంది. ఎస్వీ నారాయణ 2009లో ఓ సారి ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశాం. రూ.4లక్షల వరకు కళాశాల అభివృద్ధికి తోడ్పాటునందించాం. ముస్ముందు కూడా సహకరిస్తాం.

- ఎస్వీ ప్రసాద్, విశ్రాంత బ్యాంకు ఉద్యోగి, నంద్యాల

'విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి'



విజేతలైన విద్యార్థులతో ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల స్థాయి నుంచే విద్యార్థులు పరిశోధనలపై ఆసక్తిని పెంచుకుని శాస్త్రవేత్తలుగా ఎదగాలని విద్యార్థులకు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం వెంకాయపల్లె రవీంద్ర గ్లోబల్ స్కూల్‌లో జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను డీఈవో శామ్యూల్ పాల్ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కర్నూలులో ఒకప్పుడు సరైన పాఠశాలలు లేవని, నేడు రాష్ట్రస్థాయి గుర్తింపు పొందే సంస్థలను రవీంద్ర విద్యాసంస్థల అధినేత పుల్లయ్య నిర్వహిస్తున్నారన్నారు. డీఈవో మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆలోచనలు దాగి ఉన్నాయని వారి ప్రతిభను వెలికి తీయాల్సిన బాధ్యత ఉపాధ్యా యులదేనని అన్నారు. అనంతరం రాష్ట్రస్థాయికి ఎంపికైన విజేతలకు ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సర్టిఫికేట్లు బహుమ తులు ప్రదానం చేశారు. జిల్లా ఉప విద్యాశాఖ అధికారి హనుమంతురావు, ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆదినారాయణ రెడ్డి, విద్యాశాఖ అధికారి వినోద్ కుమార్, రవీంద్ర గ్లోబల్ స్కూల్ సీఈవో వంశీధర్, జిల్లా సైన్స్ అధికారి రంగమ్మ, పాల్గొన్నారు.

విజేతలు వీరే

- వ్యక్తిగత విభాగంలో కోసిగి ఆదర్శ పాఠశాల పదో తరగతి విద్యార్థి పి.ప్రణయ్ కుమార్ రెడ్డి తయారు చేసిన 'ఆటోమేటిక్ స్ట్రీట్ లైట్' అంశం ఎంపికైంది. ద్వితీయ స్థానంలో కామవరం జడ్పీహైచ్ తొమ్మిదో తరగతి విద్యార్థి హెచ్.సంజన్న తయారు చేసిన 'ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్' ప్రాజెక్టు ఎంపికైంది.
- గ్రూపు విభాగంలో కంబలపాడు జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు వై.రవీంద్రనాథ్ ఠాగూర్, బి.దివాకర్ తయారు చేసిన 'పొల్యూషన్ కంట్రోల్ సిస్టమ్' ప్రాజెక్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో వెల్దుర్తి ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్ఎస్ విద్యార్థులు కె.మహిత, జి.గాయత్రి తయారు చేసిన 'వెహికల్ ప్రొటెక్షన్ కవర్' ప్రాజెక్టు ఎంపికైంది.
- టీచర్ విభాగంలో గోనెగండ్ల జడ్పీహెచ్ఎస్ స్కూల్ అసిస్టెంట్ ఎం.అమానుల్లాబేగ్ తయారు చేసిన 'ఎర్త్ సైన్స్' ప్రాజెక్టు ప్రథమ స్థానంలో నిలింది. ద్వితీయ స్థానంలో గంజెహల్లి జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయిని ఎస్.రంగమ్మ తయారు చేసిన 'ఏఐ పవర్డ్ మోడ్రన్ ఎకో సిస్టమ్ టూ నేచురల్ రిసోర్సెస్' ప్రాజెక్టు ఎంపికైంది.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

మున్సిపాలిటీ అభివృద్ధికి లోకేశ్ హామీ

నంద్యాల రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మున్సిపాలిటీ అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించేందుకు ఐటీ, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ హామీ ఇచ్చినట్లు తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటుపల్లి హరిబాబు పేర్కొన్నారు. శనివారం విజయవాడలోని మంత్రి స్వగృహంలో నారా లోకేశ్‌ను కలిసినట్లు తెలిపారు. నంద్యాల మున్సిపాలిటీలో పెండింగ్ అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లామని, అదే విధంగా రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు మరింత చొరవ తీసుకోవాలని కోరామన్నారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పదించారన్నారు.

టిడ్కో గృహాలను పంపిణీ చేయాలి

నంద్యాల రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): టిడ్కో గృహాలను వెంటనే పంపిణీ చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, సీనియర్ నాయకులు తోట మద్దులు డిమాండ్ చేశారు. శనివారం నంద్యాల పట్టణ శివారు ఎస్ఆర్‌బీసీ కాలనీలో నిర్మించిన టిడ్కో గృహాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ అర్హులైన స్థానికులకే గృహాలను పంపిణీ చేయాలన్నారు. ఒక్కొక్కరిరీ 10 గృహాల దాకా కేటాయిచారని ఆరోపించారు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. టిడ్కో గృహాల లబ్ధిదారుల పేర్లను వారికి అందుబాటులో ఉండేలా నోటీస్ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు నరసింహ, మహమ్మద్‌గౌస్, వెంకటలింగం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

గడివేముల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి అన్నారు. మండలంలోని గడిగరేవుల హైస్కూల్‌లో శనివారం ఆయన విద్యార్థులకు పలు నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న సాంకేతికతను ఆసరాగా తీసుకొని కొందరు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన పెంచుకోవాలని, చుట్టూ ఉన్న సమాజాన్ని కూడా జాగృతం చేయాలని అన్నారు. ఫోన్‌లో ఏవరైనా బ్యాంకు ఖాతాల వివరాలు, ఓటీపీ అడిగితే ఎట్టి పరిస్థితుల్లో చెప్పవద్దని అన్నారు. ఫోన్‌లో వచ్చే లింక్‌లను, ప్రైవేటు వెబ్‌సైట్‌లను ఓపెన్ చేయవద్దని అన్నారు.

నేరాలతో అప్రమత్తంగా ఉండాలి

నంద్యాల క్రైం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలు, డ్రగ్స్, లోన్‌యాప్ మోసాలు తదితర వాటితో ప్రజలు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ అధికారులు పిలుపునిచ్చారు. నంద్యాల త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామలింగారెడ్డి కళాశాలలో శనివారం ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు డీఎస్పీ పి.శ్రీనివాసరెడ్డి సూచనలతో త్రీ టౌన్ సీఐ సూర్యమౌళి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

కలెక్టర్, జేసీలను కలిసిన ఎమ్మెల్యే గిత్తా


కలెక్టర్‌కు బొకే ఇస్తున్న ఎమ్మెల్యే

నందికొట్కూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ రాజకుమారి గణియా, జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ లను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. గత వారం రోజులుగా మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ సంతాప దినాలు ముగిసిన నేపథ్యంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లను మర్యాదపూర్వకంగా కలిశామన్నారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు వేంపెంట విద్యార్థి

పాములపాడు జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు వేంపెంట విద్యార్థి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు క్రిష్ణమూర్తి తెలిపారు శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న జగదీశ్వర్ జనవరి 3న నంద్యాల జిల్లా కేంద్రంలోని ఎస్‌పీజీ హైస్కూల్‌లో నిర్వహించిన సౌత్ ఇండియా సైన్స్ ఫెస్ట్ 2024-25 డిస్ట్రిక్ లెవెల్ సైన్స్ ఫెయిర్ ప్రోగ్రాంలో పాల్గొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

34 మంది బైండోవర్

పగిడ్యాల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదిలో చేపల వేట కొనసాగించేందుకు వచ్చిన 34 మంది మత్స్యకారులపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ముచ్చుమర్రి ఎస్ఐ శరత్ కుమార్‌రెడ్డి తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి చేపల వేట కొనసాగించేందుకు కొంత మంది మైనర్ బాలురులను తీసుకొని వచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తుండడంతో 34 మందిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. వీరిని పగిడ్యాల తహసీల్దార్ శివరాముడు ఎదుట హాజరు పరిచినట్లు తెలిపారు.

9లోపు గోకులం షెడ్లు పూర్తి చేయాలి

కొత్తపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9వ తేదీలోపు గోకులం షెడ్ల నిర్మాణ పనులు పూర్తి చేసుకోవాలని ఆత్మకూరు ఎన్ఆర్ఈజీఎస్ పీడీ అన్వరాభేగం లబ్ధిదారులకు సూచించారు. శనివారం ఆమె మండలంలోని వీరాపురం, గువ్వలకుంట్ల, కొత్తపల్లి, నందికుంట గ్రామాల్లో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న గోకులం షెడ్లను కొత్తపల్లి ఈసీ శ్రీనివాసులుతో కలిసి పరిశీలించారు. గోకులం షెడ్లను ఎప్పటికప్పుడు పరిశీలించి వారు త్వరితగతిన పూర్తి చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశించారు. ఆమె వెంట ఉపాది సిబ్బంది ఉన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రాధాన్యం

కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తోందని అర్హత గల ప్రతి ఒక్కరికీ సంక్షేమ లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ రాజకుమారి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో లూయిస్ బ్రెయిలీ 217వ జయంతి వేడుకలను ఘనంగా జరిగాయి. లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రస్తుత కాలమాన పరిస్థితులకనుగుణంగా సాంకేతికను మెరుగుపరుచుకొని వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకునే ప్రయత్నం చేయాలన్నారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన కింద సబ్సిడీ రుణాలు, చిరువ్యాపారాలు చేసుకునేందుకు ముద్ర రుణాలు, విశ్వకర్మయోజన పథకం కింద యూనిట్ల మంజూరుకు సంబంధించిన రుణాలన్నీ అర్హులైన వారందరికీ మంజూరు చేస్తామన్నారు. జిల్లాలో అర్హత కలిగిన వ్యక్తులకు అంత్యోదయ, అన్న యోజన కార్డులు, విభిన్న ప్రతిభావంతులకు రెండు సెంట్ల స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఫాతిమా, డీఈఓ జనార్దన్ రెడ్డి, జాతీయ అంధుల సంస్థ అధ్యక్షులు అనిల్, సుబ్రహ్మణ్యం, పుష్పరాజు, జనరల్ సెక్రటరీ మహేశ్వరరెడ్డి, విజువల్లీ చాలెంజ్‌డ్ ఎంప్లాయ్ ప్రెసిడెంట్ ఓబులేష్, వీరేష్ తదితరలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

● జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించి పాఠశాల ర్యాంకింగ్‌ను మెరుగుపరుచుకోవాలని కలెక్టర్ రాజకుమారి ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోన ఎస్‌ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాఠశాల ర్యాంకింగ్, పదో తరగతి పరీక్షల ఉత్తీర్ణత శాతంపై సమీక్షించారు. సమావేశంలో డీఈఓ జనార్దన్‌రెడ్డి, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


బహుమతులతో విజేతలు




ముగ్గులను పరిశీలిస్తున్న బీసీ రాజారెడ్డి


ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు


ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు


రెండో బహుమతి అందుకుంటున్న రామేశ్వరమ్మ


మూడో బహుమతి అందుకుంటున్న ప్రశాంతి


మూడో ప్రత్యేక బహుమతి అందుకుంటున్న జయంతి


మూడో ప్రత్యేక బహుమతి అందుకుంటున్న లక్ష్మీదేవి



నింగి చుక్కలు.. నేలకు దిగాయి

● ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు ● భారీగా తరలివచ్చిన మహిళలు, విద్యార్థినులు

పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థినులు, ఇంటి పనుల్లో బిజీగా ఉండే మహిళలు నింగిలోని చుక్కలను నేలకు దించారు. ఆకాశంలో ఇంద్రధనస్సును మరిపించేలా రంగవల్లులను వేసి మైమరిపించారు. ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలలో భాగంగా నంద్యాల పట్టణం టెక్కె మార్కెట్ యార్డులో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంప్రదాయాన్ని చాటేలా వైవిధ్యమైన రంగవల్లులతో యార్డు ప్రాంగణం ముందస్తు సంక్రాంతి శోభను సంతరించుకుంది. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.


మాట్లాడుతున్న ఆంధ్రజ్యోతి కర్నూల్ యూనిట్ బ్రాంచ్ మేనేజర్ లక్ష్మణ్









పేద విద్యార్థుల కడుపు నింపడమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

మిడుతూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థుల కడుపునింపడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. మిడుతూరు గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం పథకం ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి ఈ పథకానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. కళాశాలలో చదివే విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం ద్వారా మేధాశక్తి, శారీరక బలంతోపాటు మానసిక వికాసం కలిగే అవకాశం ఉందన్నారు. మధ్యాహ్న భోజనంలో ఒకే రకమైన మెనూ కాకుండా రోజుకోవిధంగా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. దేశం, రాష్ట్రం గర్వించేలా మంచి పౌరులుగా, మేధావులుగా అన్ని రంగాల్లో విశేష ప్రతిభ చూపించి కళాశాలలకు మంచి పేరు తీసుకు రావాలని అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో దశరథరామయ్య, ఎంఈవో ఫయిజున్నిసా బేగం, టీడీపీ సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, వెంటేశ్వర యాదవ్, గ్రామ సర్పంచు జయలక్ష్మమ్మ నాయకులు శివరామి రెడ్డి, రామస్వామి రెడ్డి, సర్వోత్తమ రెడ్డి, నరసింహ గౌడు, సుధాకర్, మనోహర్ రెడ్డి, భూపాల్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, రామేశ్వర రెడ్డి, ప్రిన్సిపాల్ శంకర్ నాయక్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు

విద్యార్థులు చదువుల్లో రాణించాలి

● శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

ఆత్మకూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): నిర్దిష్టమైన లక్ష్యంతో విద్యార్థులు చదువుల్లో రాణించాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఏలోటు ఉండకూడదన్న ఉద్దేశంతో మంత్రి నారా లోకేశ్ కళాశాలల్లో కూడా మధ్యాహ్న భోజన పథకానికి శ్రీకారం చుట్టారని అన్నారు. ఎంతో మంది గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు పట్టణాల్లోకి కళాశాల్లో విద్యనభ్యసిస్తుంటారని అయితే సమయానికి ఇంట్లో ఆహార పదార్థాలు వండలేని పక్షంలో విద్యార్థులు పస్తులు ఉండాల్సి వచ్చేదని అన్నారు. ఈ ఇబ్బందులు తలెత్తకూడదన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని కళాశాలల్లోనూ అమలు చేస్తున్నట్లు వివరించారు. అనంతరం విద్యార్థుల కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రఘురామాచార్యులు, టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, నాయకులు అబ్దుల్లాపురం బాషా ఉన్నారు.


విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

నందికొట్కూరు: నందికొట్కూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ షేక్షావళి, నందికొట్కూరు ఎంఈవో సుభాన్ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపాల్ షేక్షావళి మాట్లాడుతూ కళాశాలలో 300 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. నాయకులు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సమీప ప్రభుత్వ పాఠశాల నుంచి విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశామన్నారు.

పాణ్యం: మండలంలోని జూనియర్ కళాశాలల్లో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ పివిరామన్, ఎంపీపీ ఉశేన్‌బీ, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, టీడీపీ మండల కన్వీనర్ గణపం జయరామి రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓలు కోటయ్య, సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీలు రంగరమేష్, భాస్కరరెడ్డి, హెచ్‌ఎం మేరీసునీత, టీడీపీ నాయకులు రాంమోహన్‌నాయుడు, రాంపుల్లారెడ్డి, గుజ్జుల సుబ్బయ్య పాల్గొన్నారు.

పాములపాడు: పాములపాడులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్క సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, మండల టీడీపీ నాయకులు ఆళగడ్డ హరిసర్వోత్తమరావు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వరరావు, మధుక్రిష్ణ నబిరసూల్, మల్లికార్జున, మద్దిలేటి, లింగస్వామి, రాజ్ పాల్గొన్నారు.


విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న టీడీపీ నాయకులు ఆళగడ్డ హరిసర్వోత్తమరావు


నందికొట్కూరులో భోజనం చేస్తున్న విద్యార్థులు


పాణ్యంలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న అధికారులు, నాయకులు

ఘనంగా ఎంపీ బైరెడ్డి శబరి జన్మదిన వేడుకలు


నందికొట్కూరులోని బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి నివాసంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

నందికొట్కూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎంపీ డా.బైరెడ్డి శబరి జన్మదిన వేడుకలను నందికొట్కూరు నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని ఆయా మండల కేంద్రాల్లో ఎంపీ జన్మదిన వేడుకలను ఆమె అభిమానులు, టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం నందికొట్కూరు పట్టణంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నందికొట్కూరు పట్టణంలోని బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి నివాసంలో టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, మున్సిపల్ ఛైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కాకరవాడ చిన్నవెంకటస్వామి, టీడీపీ కౌన్సిలర్లు చాంద్‌బాషా, లాలుప్రసాద్,నాయకులు అబ్దుల్ శుకూర్, బంగారు వెంకటేశ్వర్లు, ఇబ్రహీం, సత్యనారాయణ, చికెన్ గఫార్ పాల్గొన్నారు.

పగిడ్యాల : మండలంలో నంద్యాల ఎంపీ డాక్టరు బైరెడ్డి శబరి జన్మదిన వేడుకలను నాయకులు, కార్యకర్తలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. బీరవోలు గ్రామంలో మాజీ జడ్పీటీసీ చిమ్మె బిచ్చన్న, ప్రాతకోటలో టీడీపీ నాయకుడు అల్లీవుసేన్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జయరాఘవనాయుడు, రమణరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

మిడుతూరు: నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి జన్మదిన వేడుకలను మిడుతూరు మండల టీడీపీ నాయకులు స్థానిక మాజీ సర్పంచు తువ్వా వేదావతమ్మ నివాసంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తువ్వా అయ్యపురెడ్డి, పేరెడ్డి వెంటరామిరెడ్డి, జయరాముడు, రామచంద్రుడు, అంకిరెడ్డి, నాగేశ్వర రెడ్డి, గోకారి, పూల మౌలాలి, నాగేశ్వరరావు, రామసుబ్బా రెడ్డి, సత్యం రెడ్డి పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: మండలంలో ఎంపీ శబరి జన్మదిన వేడుకలు టీడీపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. జూపాడుబంగ్లా ప్రధానకూడలి మార్కెట్‌లో భారీ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు నాగేశ్వరరావు, మందాడి కర్ణాకర్‌రెడ్డి, నాగిరెడ్డి, శివచంద్రుడు, సైపుద్దీన్,శివానందరెడ్డి, దొడ్డసుధాకర్, ఈదులకర్ణాకర్‌రెడ్డి, తిరుమలరావు, సాంబశివారెడ్డి, బాలనారాయణగౌడు, గోవింద్, సతీష్‌రెడ్డి, వెంకటరమణగౌడు, నరసింహ, వెంకటస్వామి, చెన్నారెడ్డి, రమణ, గోకారి, బాలస్వామి పాల్గొన్నారు.

● మండలంలోని పోతులపాడు సర్పంచ్ నిర్మలమ్మ, టీడీపీ నాయకులు పల్లె శివానందరెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేసి, అన్నదానం చేశారు.

పాణ్యం: మండలంలో శనివారం నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా టెలికం అడ్వయిజరీ కమిటీ సభ్యులు సిమెంటు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆలమూరు ఎంపీయూపీ పాఠశాలలో 150 మంది విద్యార్థులకు పరీక్ష అట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అడ్వయిజరీ కమిటీ సభ్యులు విజయకుమార్, బీజేపి మండల కన్వీనర్ శంకరయ్య, హెచ్‌ఎంలు గంగుల శ్రీనివాసరెడ్డి, మల్లేశ్వర్, నాయకులు గురువయ్య, చక్రపాణి, వెంకటసుబ్బయ్య, సూర్యనారాయణ, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాములపాడు: నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి జన్మదిన వేడుకలను పాములపాడులో మండల టీడీపీ నాయకులు, బీఎస్ఎన్ఎల్ సలహాదారు రమేశ్, చెల్లె బాలీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లోకేశ్, బాలస్వామి, రాయక్రిష్ణ, చింటు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.


జూపాడుబంగ్లాలో జన్మదిన కేకును కట్ చేస్తున్న టీడీపీ నాయకులు


పోతులపాడులో అన్నదానం నిర్వహించిన సర్పంచ్ నిర్మలమ్మ, టీడీపీ నాయకులు శివానందరెడ్డి


పగిడ్యాలలో సంబరాలు చేసుకుంటున్న నాయకులు

వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు



మూడురాళ్లపల్లెలో వేంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న మహిళలు

చాగలమర్రి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు రాళ్లపల్లె గ్రామంలో వేంకటేశ్వరస్వామికి శనివారం ధనుర్మాసం సందర్భంగా మహిళలు సామూహికంగా వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి పల్లకితో గ్రామోత్సవం చేశారు. సంయోజిత కన్వీనర్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో గోవిందనామ పారాయణం నిర్వహించారు. కోదండరామ, పట్టాభిరామ, చెన్నకేశవ, మద్దూరులోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి

చాగలమర్రి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని బాలుర ఉన్నత పాఠశాలలో లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం శాస్త్రీ లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేశారు. చూపులేని వారి జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయులు లూయిస్‌బ్రెయిలీ అన్నారు. పాఠశాలలో ప్రత్యేక అవసరాలుగల విద్యార్థులకు ఉపాధ్యాయురాలు భవాని బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పీడీ దాదాపీర్, సీనియర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికల చదువు దేశానికి వెలుగు



రుద్రవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు

రుద్రవరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : బాలిక చదువు దేశానికి వెలుగు అని కస్తూర్బాగాంధీ గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి అన్నారు. శనివారం బేటిబచావో, బేటి పడావో ర్యాలీ విద్యార్థులతో కలిసి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి బాలిక చదువులో ముందుండాలని పిలుపునిచ్చారు. బాలిక చదువు దేశానితో పాటు ఇంటికి వెలుగునిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సాగు నీటిని సద్వినియోగం చేసుకోవాలి



కాల్వకు నీటిని విడుదల చేస్తున్న సాగునీటి సంఘం, రైతులు

అవుకు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : రైతులు సాగు నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ ఎస్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరమణనాయక్ అన్నారు. శనివారం తిమ్మరాజు చెరువు సాగునీటి సంఘం చైర్మన్ రమణయ్య, రైతు సంఘం నాయకులతో కలసి అవుకు రిజర్వాయర్‌లో అంతర్భాగమైన తిమ్మరాజు స్లూయిస్ నుంచి ప్రధాన పంట కాల్వలకు నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన కోఆపరేటీవ్ కార్పోరేషన్ డైరెక్టర్ అరుణ్‌కుమార్‌నాయక్, టీడీపీ నాయకులు తిక్కన్న, వెంకటరాముడు నాయక్, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్వీట్లు పంపిణీ



విద్యార్థులకు స్వీట్లు పంచుతున్న గూడూరు శివరామిరెడ్డి

కొలిమిగుండ్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పార్లమెంట్‌లో రాష్ట్ర సమస్యలపై చురుగ్గా స్పందించడం అభినందనీయమని టీడీపీ కొలిమిగుండ్ల నాయకులు గూడూరు శివరామిరెడ్డి అన్నారు. శనివారం ఎంపీ శబరి జన్మదినం సందర్భంగా రమణ మహర్షి అనాథ పాఠశాలలో కేకుకట్ చేసి విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు పవన్, హరి, సుభాన్, చంద్రమోహన్‌రెడ్డి, జనార్ధన్, మల్లికార్జున, శశి పాల్గొన్నారు.

నివాళులర్పించిన కోట్ల రాఘవేంద్రరెడ్డి

బేతంచెర్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిమెంటు నగర్ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఉరుకుంద, వాసు తల్లి లక్ష్మీదేవి (72) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు కోట్ల రాఘవేంద్రరెడ్డి ఆమె భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు కృష్ణవర్ధన్‌రెడ్డి, కన్వీనర్ ఎల్ల నాగయ్య, ఎరుకుల చెరువు శివ, బేతంచెర్ల నాయకులు భీమేష్ రెడ్డి, తిరుమలేష్ చౌదరి, బుగ్గన ప్రభాకర్ రెడ్డి, బజాజ్ రామిరెడద్ది, పుట్టపాశం మోహన్‌గౌడు, దస్తగిరి, సిమెంటు నగర్ టీడీపీ నాయకులు సీపీ రాముడు, సుభాని, రాజేష్, మస్తాన్ వలి, ఇమ్మానుయేల్ సంతాపాన్ని తెలియజేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లోనే బాల్యదశ సంరక్షణ

అవుకు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాల్లోనే చిన్నారుల బాల్యదశ సంరక్షణ జరుగుతుందని ఐసీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరమ్మ శనివారం అన్నారు. మండలంలోని అన్ని కేంద్రాల్లో బాల్యదశ సంరక్షణ విద్య (ఎర్లీ చైల్డ్ హుడ్ అండ్ కేర్ ఎడ్యుకేషన్) దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శివమ్మ, పావని, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎస్సార్బీసీలో గల్లంతైన వ్యక్తి ఆచూకీ లభ్యం

బనగానపల్లె, జనవరి 4, (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని యాగంటిపల్లె రహదారిలోని ఎస్సార్బీసీ కాల్వలో పడి గల్లంతైన గాలి ఓబయ్య(85) మృతదేహం శనివారం ఆచూకీ లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఎస్సార్బీసీ కాల్వ సమీపంలో కొట్టంలో నివసిస్తున్న ఓబయ్య కాలకృత్యాలు తీర్చుకునేందుకు శుక్రవారం తెల్లవారుఝామున కాల్వవద్దకు వెళ్లి కాల్వలో పడి గల్లంతయ్యారు. ఎస్సార్బీసీ కాల్వలో గల్లంతైనట్లు కుటుంబసభ్యులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. శుక్రవారం, శనివారం పోలీసులు, మృతుని బంధువులు ఎస్సార్బీసీ కాల్వలో గాలించారు. ఎట్టకేలకు శనివారం మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి, మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నింగి చుక్కలు.. నేలకు దిగాయి

● ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు ● భారీగా తరలివచ్చిన మహిళలు, విద్యార్థినులు



బహుమతులతో విజేతలు





ముగ్గులను పరిశీలిస్తున్న బీసీ రాజారెడ్డి



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థినులు, ఇంటి పనుల్లో బిజిగా ఉండే మహిళలు నింగిలోని చుక్కలను నేలకు దించారు. ఆకాశంలో ఇంద్రధనస్సును మరిపించేలా రంగవల్లులను వేసి మైమరిపించారు. ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలలో భాగంగా నంద్యాల పట్టణం టెక్కె మార్కెట్ యార్డులో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంప్రదాయాన్ని చాటేలా వైవిధ్యమైన రంగవల్లులతో యార్డు ప్రాంగణం ముందస్తు సంక్రాంతి శోభను సంతరించుకుంది. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.



మాట్లాడుతున్న ఆంధ్రజ్యోతి కర్నూల్ యూనిట్ బ్రాంచ్ మేనేజర్ లక్ష్మణ్









రెండో బహుమతి అందుకుంటున్న రామేశ్వరమ్మ



మూడో బహుమతి అందుకుంటున్న ప్రశాంతి



మూడో ప్రత్యేక బహుమతి అందుకుంటున్న జయంతి



మూడో ప్రత్యేక బహుమతి అందుకుంటున్న లక్ష్మీదేవి



పేదల ఆకలి తీర్చడమే ప్రభుత్వ ధ్యేయం

- ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



విద్యార్థినికి అన్నం వడ్డిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని పేదల ఆకలి తీర్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా పట్టణంలోని ఎద్దుల పాపమ్మ జూనియర్ కళాశాలలో పథకాన్ని ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. విద్యార్థులకు భోజనం వడ్డించడంతో పాటు వారితో కలిసి భోంచేశారు. మెనూలో రాజీ పడకుండా విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆమె సూచించారు.

● యువతకు మెరుగైన అవకాశాలు

నియోజకవర్గంలోని యువతకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇందులో 55 మంది యువకులు పాల్గొనగా ఎంపికైన 26 మందికి ఎమ్మెల్యే నియామక పత్రాలు అందజేసి అభినందించారు.

● ఎమ్మెల్యేను కలిసిన సాగునీటి సంఘం అధ్యక్షులు

ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను కేసీ కెనాల్ డబ్ల్యూయూఏ-28, తెలుగుగంగ డబ్ల్యూయూఏ-20 సాగునీటి సంఘం అధ్యక్షులు, శిరివెళ్ల మండలం గోవిందపల్లె టీడీపీ నాయకులు సంగిరెడ్డి నాగేశ్వరరెడ్డి, సంగిరెడ్డి మహేశ్వరరెడ్డి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే ఆళ్లగడ్డ డీఎస్పీ రవి కుమార్ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శిరివెళ్ల సర్కిల్ సీఐ వంశీధర్, ఆళ్లగడ్డ రూరల్ ఎస్ఐ హరిప్రసాద్ పాల్గొన్నారు.

డోన్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమ లు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని కాలేజీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో-2 రామనర్సప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్ అన్నారు. శనివారం డోన్ ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ క్రిష్ణయ్య, యుటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

అవుకు : ప్రతి విద్యార్థి ఉన్నతంగా రాణించే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంఈవో శ్రీధర్‌రావు అన్నారు. శనివారం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బాబు, టీడీపీ ఎస్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరమణ నాయక్‌తో కలసి ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన కోఆపరేటీవ్ కార్పోరేషన్ డైరెక్టర్ అరుణ్‌కుమార్‌నాయక్, నాయకులు తిక్కన్న, వెంకటరాముడు నాయక్, జయశివుడు, ఎంఈవో 2 వెంకటేశ్వరరెడ్డి, ప్రధానోపాధ్యాయులు శింగయ్య, చెన్నకేశ్వరి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

బనగానపల్లె: పట్టణంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. రాధిక సత్యప్రపూర్ణ ప్రారంభించారు. అధ్యాపకులు కిశోర్‌కుమార్, ఆనందరావు, కృష్ణుడు శ్రీనివాసరెడ్డి భోజనం వడ్డించారు.

కొలిమిగుండ్ల : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనం పేద విద్యార్థులకు వరమని ఎంపీడీవో సాయిక్రిష్ణ అన్నారు. ప్రభుత్వ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపీడీవో సాయిక్రిష్ణ, ఎంపీడీవో కార్యాలయం ఏవో ప్రసాదరెడ్డి శనివారం ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు, హైస్కూల్ హెచ్ఎం హుసేనయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



సమస్య తెలుసుకుంటున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

బనగానపల్లె, జనవరి 4, (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను ఆలస్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి నాయకులు, కార్యకర్తలు టీడీపీ కార్యాలయానికి చేరుకోవడంతో మంత్రి స్వయంగా అర్జీలను స్వీకరించారు. న్యాయబద్ధంగా ఉన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలనుంచి ఎన్‌డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

మంత్రి బీసీకి అభినందన వెల్లువ

బనగానపల్లె మంత్రి క్యాంపు కార్యాలయంలో రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి పలువురు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా విజి లెన్స్ ఎస్పీ చౌడేశ్వరీ, బనగానపల్లె, కోవెలకుంట్ల సీఐలు ప్రవీణ్ కుమార్, హనుమంతనాయక్, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, సంజామల ఎస్ఐ రమణ య్య, రేవనూరు ఎస్ఐ భూపాలుడు, పంచాయతీరాజ్ ఉన్నతాధికారు లు, ఈఈలు, డీఈలు, ఏఈలు, వివిధ శాఖల అధికారులు మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

వైకుంఠ ఏకాదశి ఏర్పాట్ల పరిశీలన

పట్టణంలోని కొండపేట వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఈనెల 10న జరిగే వైకుంఠ ఏకాదశి వేడుకల ఏర్పాట్లను రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ శనివారం పరిశీలించారు. అంతకుముందు అమ్మవారిశాలలో మంత్రితో పాటు బీసీ ఇందిరమ్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అభివృద్ధిపై సమీక్షించారు. సమావేశంలో ఆలయ అధికారులతో పాటు ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు టంగుటూరు శ్రీనయ్య, గాలిమద్దిలేటిరెడ్డి, ఆయిల్ శ్రీనివాసులు, కూరగాయల శేఖర్, కొండపేట పెద్దలు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డుపై అధికారులతో సమీక్ష

పట్టణంలో నిర్మించనున్న రింగ్ రోడ్డు పనులపై ఆర్అండ్‌బీ అధికారులతో రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సమీక్షించారు. రింగ్ రోడ్డు రూట్ మ్యాప్‌ను ఆయన స్వయంగా పరిశీలించారు. అనంతరం అధికారులతో చర్చించి రింగ్ రోడ్డు నిర్మాణం పనుల నిర్మాణం సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ డీఈ సునీల్‌రెడ్డి, ఏఈ హుసేని తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులకు స్పందన కరువు

- 16 గ్రామాల్లో కేవలం 61 దరఖాస్తులు మాత్రమే
- అవగాహన కల్పించటంలో అధికారులు విఫలం



మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీనివాసులు

ఉయ్యాలవాడ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెవెన్యూ సదస్సులకు మండలంలో స్పందన కరువైంది. మండలంలో 20 రెవెన్యూ గ్రామాలు ఉండగా ఇప్పటి వరకు 16 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పూర్తి అయ్యాయి. శనివారం కాకరవాడ గ్రామంలో రెవెన్యూ సదస్సు జరిగింది. అధికారులు మినహా పట్టుమని పదిమంది రైతులేనా హాజరు కాలేదు. భూ సమస్యలపై ఫిర్యాదు ఇచ్చేందుకు కూడా రైతులు ఆసక్తి చూపకపోవటంపై పలు విమర్శలు వినిపిస్తున్నారు. మండలంలో ఇప్పటి వరకు జరిగిన రెవెన్యూ సదస్సులకు కేవలం 61 అర్జీలు మాత్రమే వచ్చాయి. దీంట్లో అధికంగా ఆదాయ, కుల ధృవీకరణ పత్రాల కోసం వచ్చినవే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తుంది. రెవెన్యూ సదస్సులపై అవగాహన కల్పించటం కొవడిందా, లేక మండల స్థాయి అధికారులపై రైతులకు నమ్మకం లేక అర్జీలు ఇవ్వటం లేదా, లేక జిల్లా స్థాయికి వెళ్తే త్వరగా సమస్యలు పరిష్కారం అవుతాయని భావిస్తున్నారా అన్నది తెలియాల్సిఉంది.

ముక్కోటి ఏకాదశి వేడుకలకు తరలిరండి

డోన్ రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆవులదొడ్డి గ్రామ సమీపంలోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ సన్నిధానంలో ఈ నెల 10న జరిగే ముక్కోటి ఏకాదశి వేడుకలకు భక్తులు తరలిరావాలని ఆలయ ధర్మకర్త ఆలా మోహన్ రెడ్డి కోరారు. శనివారం వేడుకలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ముక్కోటి ఏకాదశి వేడుకల్లో డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, యువ నాయకులు కోట్ల రాఘవేంద్రరెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొంటారని తెలిపారు. డోన్ పట్టణ పాతబస్టాండు నుంచి ఉచిత బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రాష్ట్ర ప్రజలకు సంక్షేమ ఫలాలు



వినతులు స్వీకరిస్తున్న ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్ రూరల్, జనవరి 4 (ఆంధ్ర జ్యోతి): కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తుందని పేద ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శనివారం విజయవాడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ప్రజావేదికలో ప్రజల నుంచి వచ్చిన వినతులను ఆయన స్వీకరించారు.

బాధితులకు పరామర్శ



డోన్‌లో బాధితకుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి బుగ్గన

డోన్ రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణంలో మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పలువురి ప్రముఖుల ఇళ్లకు వెళ్లి ఆత్మీయంగా పలకరించారు. పట్టణంలోని బ్రాహ్మణ, వైశ్య ప్రముఖులు, బలిజ సంఘం పెద్దల ఇళ్లకు వెళ్లి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతూ కోలుకున్న వారికి ఆయన పరామర్శించారు. ఆయన వెంట వైసీపీ నాయకులు ఉన్నారు.

ప్యాపిలి: మండలంలోని ఎర్రగుంట్లపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వైసీపీ నాయకుడు రామసుబ్బారెడ్డి కుటుంబాన్ని శనివారం మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పరామర్శించారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని, అధైర్య పడవద్దని సూచించారు. నాయకులు శ్రీరాములు, బోరెడ్డి పుల్లారెడ్డి, క్రిష్ణారెడ్డి, క్రిష్ణమూర్తి, బోరెడ్డిరాము, బోరా మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కులగణనలో తప్పులు సరి చేయాలి

డోన్ రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులగణనలో తప్పులను సరిచేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు ఈశ్వరయ్య మాదిగ డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దార్ నాగమణిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఎస్సీ కులగణనలో మాదాసి, మాదారి కురవల పేర్లను తొలగించాలని ఆయన కోరారు. కార్యక్ర మంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు పులికేశవయ్య పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారమే లక్ష్యం

చాగలమర్రి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. శనివారం మండలంలోని డి.వనిపెంట గ్రామంలో రెవెన్యూ గ్రామ సభ ఏర్పాటు చేశారు. భూసమస్యలపై అవగాహన ర్యాలీ చేశారు. రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. రైతుల సమస్యలను వారం రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ మద్దిలేటి, మధు, ఆర్ఐ సత్తార్, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పనిసరి

చాగలమర్రి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన డొక్కా సీతమ్మ పథకంలో మెనూ తప్పనిసరిగా పాటించాలని ఎంఈవో అనూరాధ తెలిపారు. శనివారం చింతలచెరువు ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. నాణ్యతగల భోజనం, కోడిగుడ్లు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. పది విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వందశాతం ఉత్తీర్ణత కు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.